క్లుప్తంగా

సీఐటీయూ నిరసన



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కార్మికులు, కార్మిక సంఘాలు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్స్‌గా మార్పుచేసి కార్మికుల హక్కులు హరిస్తోందని సీఐటీయూ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. కొండపల్లి ఐడీఏలో కార్మిక చట్టాల రక్షణ కోసం బుధవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. సీఐటీయూ పట్టణ కార్యదర్శి మహేష్ మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం కార్మికుల కనీస హక్కులు కాలరాస్తూ కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేస్తోందని దుయ్యబట్టారు. లేబర్ కోడ్స్ వలన కార్మికుల ప్రాణాలకు భద్రత లేకుండా పోయిందన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ, బోనస్, కనీస వేతనాలు సైతం వచ్చే పరిస్థితి లేదన్నారు. గ్యాస్ ఆయిల్ యూనియన్ అధ్యక్షుడు సందరరావు, కార్యదర్శి రాజశేఖర్‌బాబు, కార్మికులు పాల్గొన్నారు.

చాట్రాయిలో పొలం పిలుస్తోంది

చాట్రాయి: మొక్కజొన్న పైరుకు ఆశించే తెగుళ్ల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని వ్యవసాయ అధికారి బి. శివశంకర్ తెలిపారు. చాట్రాయిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రసాయనిక ఎరువులు కాకుండా సేంద్రియ ఎరువులు వాడాలని సూచించారు. సస్యరక్షణ, నీరు, ఎరువుల యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

● ముసునూరు: వేల్పుచర్ల, యల్లాపురంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. జిల్లా వ్యవసాయ వనరుల కేంద్రం ఏడీఏ లలిత సుధ మాట్లాడుతూ రైతుల సేద్యంలో మెలకువలు, ప్రయోజనాల కోసం కేంద్ర ప్రభుత్వం రూపొందించిన ఎన్‌పీఎస్ఎస్ యాప్‌ను తమ ఫోన్లలో డౌన్‌లోడ్ చేసుకుని పంటల సమగ్ర సస్య రక్షణకు అవసరమైన వివరాలు తెలుసుకోవాలని సూచించారు. ఈ–క్రాప్ నమోదు, పంటల బీమా చెల్లింపు, భూసార పరీక్షల వివరాలను రైతులకు తెలిపారు. ఏఈఓ రామకృష్ణ నాయక్, వీహెచ్‌ఏలు, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వరిసాగుపై అవగాహన



జి.కొండూరు: అగ్రి కనెక్ట్‌లో భాగంగా కుంటముక్కల ఎంపీయూపీ పాఠశాలలో విద్యార్థులకు వరిసాగుపై అవగాహన కార్యక్రమాన్ని వ్యవసాయాధికారులు బుధవారం నిర్వహించారు. గ్రామ శివారులోని రబీ వరి సాగు క్షేత్రం వద్ద విద్యార్థులకు వరి సాగు విధానం, నారుమడుల పెంపకం, నీటి యాజమాన్యం, పురుగులు, తెగుళ్ల నివారణ తదితర అంశాలను ఏఓ రాంకుమార్ వివరించారు. వెంకటాపురం, కుంటముక్కల గ్రామాలలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మామిడి రైతులకు నల్ల తామర పురుగు నిర్మూలనపై ఉద్యాన అధికారి నీలిమ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థినులకు వైద్య పరీక్షలు

చాట్రాయి: కౌమార దశలో వచ్చే మార్పులపై అవగాహన కలిగి ఉండాలని పీహెచ్‌సీ వైద్యాధికారి విజయలక్ష్మి అన్నారు. చిత్తపూరు జెడ్పీ హైస్కూల్లో రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు బుధవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని చెప్పారు. మహిళల్లో రక్తహీనత నివారణకు ఐరన్ మాత్రలు వాడాలని ఆమె సూచించారు. అనంతరం 117 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. సీహెచ్ఓ రమణ, ఏఎన్ఎంలు, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

కేఎస్‌కు మద్దతుగా ప్రచారం

తిరువూరు: కృష్ణా–గుంటూరు పట్టభద్రుల శాసన మండలి ఎన్నికల్లో పీడీఎఫ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కేఎస్ లక్ష్మణరావుకు మద్దతుగా తిరువూరులో బుధవారం ప్రజా సంఘాల నాయకులు ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కార్యాలయాల్లో పట్టభద్రులను కలిసి లక్ష్మణరావుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజా సంఘాల నాయకులు మేకల నాగేంద్రప్రసాద్, రామకృష్ణ, బలగాని వెంకటేశ్వరరావు, రవి, శీనయ్య, భద్రం ప్రచారంలో పాల్గొన్నారు.

బాలికను కొట్టిన కేసుపై విచారణ

ముసునూరు: ఎల్‌కేజీ చదువుతున్న బాలికను తీవ్రంగా కొట్టిన ఘటనలో ఉపాధ్యాయుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తహసీల్దార్ కె.రాజ్‌కుమార్ చెప్పారు. చెక్కపల్లిలో ఓ ప్రైవేటు పాఠశాలలో మంగళవారం ఎల్‌కేజీ విద్యార్థినిని కొట్టిన ఉపాధ్యాయుడు కె.సురేష్ తోపాటు, పాఠశాల కరస్పాండెంట్‌ను బుధవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నూజివీడు డీవైఈఓ సేవియా నాయక్ పాఠశాలలో విచారణ చేపట్టారు.

సారా విక్రేత అరెస్టు

ముసునూరు: ముసునూరులో వీరంకి సారిక ఇంటిలో బుధవారం సోదాలు చేసి రెండు లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. సారా విక్రేతపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. దాడిలో సబ్ ఇన్‌స్పెక్టర్లు వై.ఈశ్వరరావు, ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

అడుగడుగునా గుంతలు

- అసంపూర్తిగా మరమ్మతులు
- గోతుల్లో పడి వాహన చోదకులకు గాయాలు
- నిధులు మంజూరైనా జరగని పనులు
- వాహన చోదకుల ఇబ్బందులు



తిరువూరు–పెద్దవరం రోడ్డులో వావిలాల వద్ద తవ్వి వదిలేసిన రహదారి

తిరువూరు: సంక్రాంతి నాటికి గోతులు లేని రోడ్లపై రాకపోకలు సాగించవచ్చని ప్రభుత్వం ప్రకటించినా తిరువూరు నియోజకవర్గంలో మాత్రం పలు రహదారులు కనీస మరమ్మతులకు నోచుకోలేదు. గుంతలమయమైన రహదారులపై రాకపోకలతో ప్రజలు నిత్యం అవస్థలు పడుతున్నారు. మంజూరైన నిధులతో గోతులు పూడ్చాలని గ్రామాల ప్రజలు కోరుతున్నారు. తిరువూరు ఆర్ అండ్ బీ సబ్ డివిజన్‌లో 26 పనులకు రూ.4.21 కోట్లు మంజూరు కాగా సగం పనులు మాత్రమే చేయగలిగారు. గుంతల్లో కంకరవేసి తారు పోసి మరమ్మతులు అయిందనిపిస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకుండా జరుగుతున్న పనులలో నాణ్యత కొరవడిందని పలువురు విమర్శిస్తున్నారు.

తవ్వి వదిలేశారు..

రహదారులకు మరమ్మతు పనుల నిర్వహణ నిమిత్తం నెల రోజుల కిందట ఆర్ అండ్ బీ కాంట్రాక్టర్లు తిరువూరు–వావిలాల రోడ్డును పలు చోట్ల తవ్వి వదిలేశారు. అక్కడక్కడా చిన్న గుంతలు మాత్రం పూడ్చిన కాంట్రాక్టరు పూర్తిగా పాడైపోయిన ప్రదేశాలను పట్టించుకోవడం లేదు. తిరువూరు–మధిర ఆర్ అండ్ బీ రహదారిలోనూ ఇదే పరిస్థితి. అక్కపాలెం, కోకిలంపాడు, కొమ్మిరెడ్డిపల్లి రహదారుల దుస్థితిని పట్టించుకున్న వారే లేరు. శ్రీనికేతన్–కొత్తపల్లి రహదారికి సైతం రూ.2 కోట్లకు పైగా నిధులు మంజూరు కాగా పనులు చేయడంలో ఆర్ అండ్ బీ అధికారులు జాప్యం చేస్తున్నారని గ్రామస్తులు విమర్శిస్తున్నారు.



తిరువూరు–టేకులపల్లి రోడ్డు దుస్థితి



అధ్వానంగా మారిన తిరువూరు–రాజవరం ఆర్ అండ్ బీ రోడ్డు

పనులు జరుగుతున్నాయి

రోడ్ల మరమ్మతు పనులు పురోగతిలో ఉన్నాయి. ఫిబ్రవరి 15 నాటికి పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు తెలియజేశాం. శ్రీనికేతన్–కొత్తపల్లి, తిరువూరు–కోకిలంపాడు రోడ్లు పూర్తి స్థాయిలో నిర్మించాల్సి ఉంది.

– గాయత్రి, ఆర్ అండ్ బీ జేఈ, తిరువూరు

వెంటనే మరమ్మతులు చేయాలి



గ్రామీణ రహదారులకు సంక్రాంతికి ముందే మరమ్మతులు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించినా ఇంతవరకు సగం పనులు కూడా జరగలేదు. చేసిన మరమ్మతులు కూడా నాసిరకంగా ఉండటంతో నిధులు వృథా అవుతున్నాయి. వేగవంతంగా మరమ్మతులు చేయాలి.

– కాలసాని విజయలక్ష్మి, తిరువూరు

గుంతలు పూడ్చాలి



నిత్యం రద్దీగా ఉండే రోడ్లలో గుంతల కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్ల పునర్నిర్మాణం జరపడంలో ప్రభుత్వాధికారులు ఉదాసీన వైఖరి అవలంభిస్తున్నారు. కనీసం గుంతలను పూడ్చి ప్రమాదాలు నివారించాలి.

– మోదుగు శివయ్య, ముష్టికుంట్ల

కొలతల ప్రకారం పనిచేయాలి

సబ్ కలెక్టర్ కావూరి చైతన్య



జి.కొండూరు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కూలీలు అధికారులు సూచించిన కొలతల ప్రకారం పని చేస్తే రూ.300 వరకు వేతనం పొందవచ్చని సబ్ కలెక్టర్ కావూరి చైతన్య అన్నారు. కవులూరు గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధి హామీ పనులు, కూలీల హాజరు తదితర అంశాలను రికార్డులలో పరిశీలించారు. సబ్ కలెక్టర్ మాట్లాడుతూ కూలీలకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా అన్ని మౌలిక వసతులను కల్పించాలని సూచించారు. ఉపాధి హామీ సిబ్బంది ప్రతి రోజూ పని పరిధిని కేటాయిస్తే కూలీలకు అధిక వేతనం పొందే అవకాశం ఉంటుందన్నారు. అనంతరం గ్రామంలో వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్‌ను పరిశీలించారు. వర్మి కంపోస్టు తయారీపై అధికారులు దృష్టి సారించాలన్నారు. అనంతరం గడ్డమణుగు గ్రామంలో జరుగుతున్న భూముల రీ సర్వే కార్యక్రమాన్ని పరిశీలించారు. రీ సర్వే జరుగుతున్నప్పుడు సదరు భూ యజమానులు కానీ, వారి ప్రతినిధులు కానీ తప్పకుండా హాజరయ్యేలా చూసుకోవాలని సూచించారు. ఇచ్చిన టార్గెట్ ప్రకారం ప్రతి రోజూ సర్వే పూర్తి చేయాలన్నారు. తహసీల్దార్ చాట్ల వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ రామకృష్ణనాయక్, అధికారులు పాల్గొన్నారు.

ఏటీఎల్ ల్యాబ్స్‌తో నూతన ఆవిష్కరణలు

జిల్లా సైన్స్ అధికారి హుస్సేన్

తిరువూరు: విద్యార్థులు నూతన ఆవిష్కరణలు తయారు చేసేందుకు అటల్ టింకరింగ్ ల్యాబ్స్ ఉపయోగపడతాయని ఎన్టీఆర్ జిల్లా సైన్స్ అధికారి డాక్టర్ మైనం హుస్సేన్ అన్నారు. తిరువూరులోని అంబేడ్కర్ గురుకులం, శ్రీనిధి స్కూల్, సెయింట్ ఆన్స్ స్కూల్‌లో అటల్ టింకరింగ్ ల్యాబ్స్‌ను బుధవారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ అటల్ ఇన్నోవేషన్ మిషన్ ద్వారా ఏర్పాటైన ఈ ల్యాబ్‌లలో విద్యార్థులతో చేసే ఆవిష్కరణలు దేశాభివృద్ధికి ఉపయోగపడేలా ఉండాలని కేంద్ర ప్రభుత్వం ఆశిస్తోందన్నారు. ఒక్కో ల్యాబ్‌కు ప్రభుత్వం రూ.22 లక్షలు మంజూరు చేస్తోందని, ఇందులో తొలి విడతగా రూ.12 లక్షల చొప్పున కేటాయించినందున ప్రయోగశాలలను పూర్తి స్థాయిలో వినియోగించు కోవాలని సూచించారు.



తిరువూరు అంబేడ్కర్ గురుకులంలో ఏటీఎల్ ల్యాబ్‌ను పరిశీలిస్తున్న హుస్సేన్

ఎన్టీఆర్ జిల్లాలో 17 అటల్ టింకరింగ్ ల్యాబ్స్ పని చేస్తున్నాయని, వీటిలో తిరువూరు సెయింట్ ఆన్స్ స్కూల్ జాతీయ స్థాయి ఇన్‌స్పైయిర్ పోటీలకు ఎంపికైందని చెప్పారు. గత ఏడాది తిరువూరు అంబేడ్కర్ గురుకులానికి జాతీయ స్థాయి అవార్డు లభించిందన్నారు. ప్రజలకు అవసరమైన శాస్త్రీయ ఆవిష్కరణలు చేసే పాఠశాలలకు మరిన్ని ప్రోత్సాహకాలు కూడా లభిస్తాయని వివరించారు.

మద్యం దుకాణాల దరఖాస్తు గడువు పెంపు

తిరువూరు: గీత కార్మికులకు కేటాయించిన మద్యం దుకాణాలకు దరఖాస్తు గడువును ప్రభుత్వం పెంచిందని తిరువూరు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం సాయంత్రంతో గడువు ముగియగా ఈ నెల 8వ తేదీ వరకు పొడిగించారని చెప్పారు. ఆసక్తి కలవారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

● మైలవరం: రెడ్డిగూడెం మండలంలో గీత కార్మికులకు కేటాయించిన ఒక మద్యం దుకాణానికి దరఖాస్తుల స్వీకరణ గడవు ఈనెల 8వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు పొడిగించారని మైలవరం ఎక్సైజ్ సీఐ జె.శ్రీనివాస్ గురువారం తెలిపారు. మద్యం దుకాణాలకు లాటరీని ఈ నెల 10వ తేదీ ఉదయం 9 గంటల నుంచి గొల్లపూడి లోని బీసీ భవన్‌లో నిర్వహిస్తారని చెప్పారు.

● నూజివీడు: నియోజకవర్గంలో గీత కార్మికులకు కేటాయించిన నాలుగు మద్యం షాపులకు దరఖాస్తు చేసుకునేందుకు గడువును ఈనెల 8వ తేదీ వరకు పెంచామని నూజివీడు ఎక్సైజ్ స్టేషన్ సీఐ ఎ. మస్తానయ్య బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వచ్చిన దరఖాస్తుల నుంచి ఈనెల 10న కలెక్టర్ ఏలూరులో లాటరీ తీసి లబ్ధిదారులను ఎంపిక చేస్తారని చెప్పారు.

వేంకటాచలస్వామి అధ్యయనోత్సవాలు ప్రారంభం



తిరువూరు: స్థానిక పాత తిరువూరులోని వేంకటాచల స్వామి దేవస్థానంలో బుధవారం స్వామివారి అధ్యయనోత్సవాలు ప్రారంభమయ్యాయి. అర్చకులు దేవయాజనం వేణుగోపాలాచార్యులు, విఠలాచార్యులు ఆధ్వర్యంలో స్వామి వారి పల్లకీసేవ, ప్రాబోధక ఆరగింపు అనంతరం విశేష పూజలు నిర్వహించారు. ఈ నెల 9 వరకు అధ్యయనోత్సవాలు, 10వ తేదీ నుంచి కల్యాణోత్సవాలు జరుగుతాయన్నారు. 12న రాత్రి 10 గంటలకు వేంకటాచలస్వామి కల్యాణం జరుగుతుందని చెప్పారు.

డీఎల్పీఓ సుందరికి సన్మానం

ముసునూరు: గ్రామాల అభివృద్ధికి చేస్తున్న కృషిని ప్రభుత్వం గుర్తించడం మహదానందం కలిగించిందని జిల్లా ఉత్తమ డీఎల్పీఓ అవార్డు గ్రహీత, మండల ప్రత్యేకాధికారి ఎంపీఎస్ సుందరి అన్నారు. బుధవారం ముసునూరులో పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో ఎంపీడీఓ జి.రాణి అధ్యక్షతన ఇటీవల కలెక్టర్ చేతుల మీదుగా జిల్లా ఉత్తమ డీఎల్పీఓ అవార్డు స్వీకరించిన ఎంపీఎస్ సుందరిని ఘనంగా సన్మానించారు. ఈఓపీఆర్డీ సత్యనారాయణ, గ్రామ కార్యదర్శులు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

మామిడి రైతులను ఆదుకోవాలి

విస్సన్నపేట: వాతావరణ ప్రతికూలత కారణంగా ఈ ఏడాది మామిడి పంట దిగుబడి గణనీయంగా తగ్గే అవకాశం ఉన్నందున నష్టపోయే రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతు సంఘ నాయకుడు ఏడుకొండలు కోరారు. బుధవారం మండలంలోని మామిడి తోటలను ఆయన పరిశీలించి మాట్లాడారు. మామిడితోటల్లో తెగుళ్ల బెడద నివారణకు రైతులు చేపడుతున్న సస్యరక్షణ చర్యలతో ఖర్చు అధికమైందన్నారు. ఉద్యాన శాఖాధికారులు తెగుళ్ల నివారణకు తగు సూచనలు, సలహాలివ్వాలని కోరారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు, రైతులు పాల్గొన్నారు.

రీ సర్వేతో కచ్చితమైన కొలతలు

తహసీల్దార్ సుశీలాదేవి

మైలవరం: రైతులకు సంబంధించిన వ్యవసాయ భూములు రీ సర్వే చేయడం వలన కచ్చితమైన కొలతలు వస్తాయని రెడ్డిగూడెం తహసీల్దార్ జె.సుశీలాదేవి అన్నారు. ముచ్చనపల్లి గ్రామంలో బుధవారం రీ సర్వే కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ ఈ సర్వేలో ఎటువంటి పొరపాట్లు రాకుండా ఖచ్చితమైన రికార్డులు అందజేయాలని అధికారులకు సూచించారు. గ్రామంలో రైతులకు వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసి రీ సర్వే విషయంలో ఎప్పటికప్పుడు సమాచారం అందజేయాలన్నారు. మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గంధం పుల్లయ్య, మండల సర్వేయర్ మురళీధర్, వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

రసాయనాల వినియోగంతో మామిడి పండ్లు విషతుల్యం

మామిడి శాస్త్రవేత్త కనక మహాలక్ష్మి

నూజివీడు: మామిడి తోటల్లో రసాయన మందులు విచ్చలవిడిగా వినియోగిస్తే పండ్లు విషతుల్యమవుతాయని శాస్త్రవేత్తలు హెచ్చరించారు. వెంకటరామన్నగూడెంలోని బీఎస్సీ హార్టీకల్చర్ కోర్సును అభ్యసిస్తున్న విద్యార్థినులు పని అనుభవ కార్యక్రమంలో భాగంగా నూజివీడు మండలం హనుమంతులగూడెంలో బుధవారం మామిడి రైతుల సదస్సును, ఉద్యాన ప్రదర్శనను నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మామిడి తోటల్లో తామర పురుగుల నివారణ చర్యలు చేపట్టాలన్నారు. మామిడిలో పోషక, నీటి యాజమాన్యం పద్ధతులపై ఉద్యాన కళాశాల ప్రొఫెసర్ కరుణశ్రీ అవగాహన కల్పించారు. రాష్ట్రంలో రైతులు సాగు చేసే మామిడి రకాలు, వాటి ఉప ఉత్పత్తులను హార్టీకల్చర్ విద్యార్థులు ప్రదర్శించారు.

మార్చి 5 నుంచి ఉపవాస ప్రార్థనలు

మైలవరం: మైలవరం ఆర్‌సీఎం చర్చిలో మార్చి 5వ తేదీ నుంచి తపస్సు కాల ఉపవాస స్వస్థత ప్రార్థనా సదస్సులు ప్రారంభమవుతాయని ఆర్‌సీఎం విచారణ గురువు రెవరెండ్ ఫాదర్ అనిల్ ఫ్రాన్సిస్ తెలిపారు. స్థానిక ఆర్‌సీఎం చర్చిలో మైలవరం విచారణ పరిధిలోని 16 గ్రామాల సంఘాల పెద్దలతో బుధవారం సమావేశం నిర్వహించారు. 40 రోజుల తపస్సు కాల ఉపవాస స్వస్థత ప్రార్థన సదస్సులు ఆయా గ్రామాల్లో మూడేసి రోజులు జరుగుతాయని చెప్పారు. గ్రామాల్లో నెలకొని ఉన్న పరిస్థితులు, ఆధ్యాత్మికతకు సంబంధించిన వివిధ అంశాలపై చర్చించారు. అనంతరం దివ్య పూజాబలి, ప్రేమ విందు నిర్వహించారు. లిటిల్ ఫ్లవర్ కాన్వెంట్ సిస్టర్స్, ఉపదేశికులు, 16 గ్రామాల సంఘాల పెద్దలు పాల్గొన్నారు.

అక్రమంగా మట్టి తరలింపు

పట్టించుకోని అధికారులు



చిన్నంపేట పెట్రోలు బంకు పక్కన తరలించిన మట్టి

చాట్రాయి: గ్రామాల్లో అభివృద్ధి పనులకు మట్టి తరలింపునకు అనుమతుల్లేవంటూ అడ్డుకుంటున్న రెవెన్యూ అధికారులు అక్రమంగా మట్టి తరలిస్తున్నా పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. పేదోడి ఇంటికి అవసరమైన మట్టి తోలకానికి దరఖాస్తు చేసుకున్నా అధికారులు అనుమతించడం లేదు. తీరా అనుమతుల కోసం వెళితే వైఎస్సార్ సీపీ సానుభూతిపరులైతే అనుమతులు ఇచ్చేది లేదంటూ రెవెన్యూ శాఖాధికారులు సమాధానం చెబుతున్నారు. టీడీపీ సానుభూతి పరులకు మాత్రం అనుమతులేవీ లేకపోయినా మట్టి దందాకు అధికారులు జెండా ఊపుతున్నారు. వైఎస్సార్ సీపీ సర్పంచ్‌లు వెళ్లి గ్రామాల్లో అభివృద్ధి పనులకు మట్టి తోలకాలకు అనుమతులు ఇవ్వాలంటూ అర్జీలు పెట్టుకున్నా వాటిని బుట్టదాఖలు చేస్తున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల మండలంలోని నరసింహారావుపాలెం సర్పంచ్ విస్సంపల్లి ప్రశాంతి గ్రామంలో అభివృద్ధి పనులకు మట్టి తోలకాలకు అనుమతులు ఇవ్వాలని గ్రామ పంచాయతీ తీర్మానంతో తహసీల్దార్ ప్రశాంతికి అర్జీ పెట్టుకున్నా స్పందన కరువైంది. ఇటీవల చిన్నంపేటలో వందల ట్రిప్పులు మట్టి తరలిస్తున్నా రెవెన్యూ అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రజా ప్రతినిధులు ప్రశ్నిస్తున్నారు. మండలంలో అన్ని గ్రామాల్లో టీడీపీ నాయకులు, ప్రైవేటు వ్యక్తులు యథేచ్ఛగా మట్టిని తరలిస్తున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. అక్రమ మట్టి తరలింపులో రూ.వేలు రోజూ చేతులు మారుతున్నాయని ఆయా గ్రామ పంచాయతీల ప్రజాప్రతినిధులు ఆరోపిస్తున్నారు. మండలంలోని చిత్తపూరులో బీసీ కాలనీకి వెళ్లే డొంక రోడ్డు బురదమయంగా ఉండడంతో సర్పంచ్ తిరువీధి రమేష్ 10 ట్రిప్పులు గ్రావెల్ తరలించారు. మరుసటి రోజున తహసీల్దార్ వీఆర్‌ఓని, కానిస్టేబుల్‌ని పంపించి ట్రాక్టర్‌ని సీజ్ చేయించారు. వైఎస్సార్ సీపీ సర్పంచ్‌లు కార్యాలయానికి వెళ్లి అడిగితే తహసీల్దార్ అసభ్యకరంగా మాట్లాడుతున్నారని సర్పంచ్ తిరువీధి రమేష్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంత్రి పార్థసారథి అండదండలతోనే తహసీల్దార్ వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. అధికారుల తీరు మారకుంటే మండల వ్యాప్తంగా ధర్నా చేస్తామని ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు హెచ్చరిస్తున్నారు.

సాధనతో మంచి మార్కులు సాధ్యం

తిరువూరు: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులు సాధించేందుకు విద్యార్థులు సులభ చిట్కాలు తెలుసుకోవాలని ఆంగ్ల భాషోపాధ్యాయ సంఘాధ్యక్షుడు, రిసోర్స్‌పర్సన్ ఎం. రాంప్రదీప్ అన్నారు. గంపలగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం పదో తరగతి విద్యార్థులకు ఇంగ్లీష్ సబ్జెక్టులో ఎక్కువ మార్కులు సాధించేందుకు పలు సూచనలిచ్చారు. ఆయన మాట్లాడుతూ పాఠ్య పుస్తకాలు బాగా చదవడంతో పాటు మోడల్ పేపర్లను సాధన చేయాలని సూచించారు. పరీక్షా విధానం, ఏ పాఠ్యాంశాల నుంచి ఎక్కువ ప్రశ్నలు వచ్చే అవకాశం ఉంటుందనే అంశాలపై అవగాహన కల్పించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎంఎం కొండలు, ఆంగ్ల ఉపాధ్యాయుడు అప్పారావు పాల్గొన్నారు.

విద్యార్థుల క్షేత్ర ప్రదర్శన

రోలుపడి(తిరువూరురూరల్): మండలంలోని రోలుపడి ఎంపీయూపీ స్కూల్ విద్యార్థులకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో బుధవారం క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. వరి సాగు చేసే విధానం, పొలంలో కలుపు తీత, సాగునీరు, ఎరువులు, పురుగు మందుల యాజమాన్యం, పంటలకు సోకే తెగుళ్ల గురించి మండల వ్యవసాయాధికారి పద్మ విద్యార్థులకు వివరించారు. వ్యవసాయ యాంత్రికీకరణ ప్రయోజనాలను వివరించారు. ఎంపీయూపీ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు రవిశంకర్, పశు వైద్యాధికారి స్వప్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్ ప్రతులను దహనం చేసి నిరసన



కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రతులను మైలవరంలో దహనం చేస్తున్న సీఐటీయూ, సీపీఎం నాయకులు

మైలవరం: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కార్మికులు, రైతులు, పేద, మధ్య తరగతి ప్రజలకు తీరని అన్యాయం చేసిందని సీఐటీయూ మండల కార్యదర్శి సీహెచ్ సుధాకర్ అన్నారు. కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కార్మికులు, రైతులకు తీరని అన్యాయం చేసిందని, ఆంధ్ర రాష్ట్రానికి బడ్జెట్‌లో తూతూ మంత్రంగా కేటాయింపులు చేసిందని ఆరోపించారు. దీనిని నిరసిస్తూ మైలవరం జెండా చెట్టు సెంటర్‌లో కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రతులను బుధవారం దహనం చేశారు. సుధాకర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పెట్టుబడి దారులకు లాభం చేకూరేలా ఈ బడ్జెట్ ఉందన్నారు. కార్మికులు, రైతులకు కన్నీళ్లు మిగిల్చిందని చెప్పారు. కనీస వేతనం ప్రస్తావన లేదని, రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర ఊసే లేదని చెప్పారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసి లేబర్ కోడ్స్‌ను అమలు చేసేందుకు 2019లో వేతనాల కోడ్ 2020లో పారిశ్రామిక సంబంధాలు కోడ్ సామాజిక భద్రత కోడ్ వృత్తిభద్రత, ఆరోగ్యం, నేచర్ ఆఫ్ వర్క్ కోడ్ తీసుకు వచ్చిందని చెప్పారు. రైతు సంఘం మండల కార్యదర్శి వజ్రాల వెంకటరెడ్డి, మండల అధ్యక్షుడు రావుల సుబ్బారావు, వర్కర్స్ యూనియన్ నాయకుడు చంటి, శ్రీనివాస్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు అబ్రహాం, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వకాలు

తిరువూరురూరల్: మండలంలోని కట్టెలేరు వాగులో ఇష్టానుసారం ఇసుక తవ్వేస్తుండటంతో గ్రామాల్లో రక్షిత మంచినీటి పథకాలకు వేసవి కంటే ముందే తాగునీటి ఎద్దడి ఉత్పన్నమవుతోంది. అనుమతి లేకుండా వాగుల్లో ఇసుక తవ్వకం నిషేధించినప్పటికీ చిట్టేల వద్ద కట్టెలేరులో ఇసుకను ట్రాక్టర్లలో తరలిస్తున్నారు. రక్షిత మంచినీటి పథకాలకు సమీపంలో ఇసుక తవ్వరాదని నిబంధనలు ఉన్నప్పటికీ కట్టెలేరులో ఇసుక తోడేస్తున్నారు. ఇప్పటికే గానుగపాడు వద్ద వాగులో నుంచి ఉచిత ఇసుక తరలిపోవడంతో ఈ ఏడాది వేసవిలో తాగునీటి సమస్య తప్పదని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై తిరువూరు తహసీల్దారు లక్ష్మిని వివరణ కోరగా, అనుమతి ఇచ్చిన చోటే ఇసుక తెచ్చుకోవాలని, గ్రామ సచివాలయం నుంచి అనుమతి పత్రం పొందిన వారికే ఉచిత ఇసుక సరఫరా చేస్తామన్నారు. చిట్టేల వద్ద ఇసుక తవ్వకాలు నిరోధిస్తామని చెప్పారు.

● గుర్రపుడెక్క తొలగించరూ



జక్కంపూడి కాలనీ సమీపంలో పంట కాలువలో పేరుకుపోయిన గుర్రపుడెక్క

గొల్లపూడి పరిధి పంట కాలువ రోడ్డులో పంట పొలాలకు నీరు అందించే కాలువలో గుర్రపు డెక్క పేరుకుపోయింది. నీటి ప్రవాహానికి ఇది అడ్డంకిగా మారింది. దిగువ ప్రాంతానికి నీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి గుర్రపుడెక్క తొలగింపునకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. –సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ